# ఎందరో ధర్మరాజులు

"టూ ఏసెస్ అండ్ ఎ కింగ్" అన్నాడు ముక్కలు బల్ల మీద పరుస్తూ ధరమ్.

అతనా మాట అనగానే 'వెల్ డన్' అంటూ చప్పట్లు కొట్టింది మిసెస్ వినితా ధరమ్.

రాజా మాత్రం ఏమీ మాట్లాడకుండా జేబులోంచి పర్సు తీసి నాలుగు వంద రూపాయల నోట్లు బల్ల మీదకు విసిరేశాడు.

పావని ఈలోగా నాలుగు గ్లాసుల్లోనూ కెస్‌లెర్ అమెరికన్ బ్లెండెడ్ విస్కీ నింపింది. సోడా కలుపుతూ "ఓ.కె. రాజా..ఈసారి ఆట నీదే కానీయ్" అన్నది రాజాని ఉత్సాహపరుస్తూ.

ఇక ఆడదామా, వద్దా అన్న సందిగ్ధంలో వున్న రాజా, పావని మాటలు విని, ఇక ఆడదామనే నిశ్చయించుకున్నాడు.

"డార్లింగ్! నీ దగ్గర వున్న డబ్బు కూడా యిలాతే!" అన్నాడు పేక ముక్కలు కలుపుతూ.

పావని హేండ్‌బాగ్ ఓపెన్ చేసి రెండు వందలు రాజా ముందు ఉంచింది.

ధరమ్ డన్‌హిల్ సిగరెట్టు అంటించి గట్టిగా పొగపీల్చి, నెమ్మదిగా వదులుతూ అన్నాడు, "రాజా, ఇవాళ నీకు అంతా బాడ్‌లక్ ఎదురవుతున్నది..యిప్పటిదాకా నీ లాస్ ఎంత?"

రాజా అన్నాడు, " నా పర్సులో ఇంకా వంద మాత్రమే వుంది. అంటే పధ్నాలుగు వందల దాకా పోయాయన్నమాట!"

"ఎక్కడికిపోయాయిలెండి.. ధరమ్ దగ్గరే వున్నాయి కదా!" అన్నది వినీత చిరునవ్వు నవ్వుతూ.

పావని రాజా తనకు వేసుకున్న ముక్కలు తీసి ముద్దుపెట్టుకుని రాజాకి అందించింది.

అతను ముందు పావని చేతిని తరువాత ముక్కల్ని ముద్దు పెట్టుకుని ఆడటానికి ఉపక్రమించాడు.

ధరమ్ మాత్రం కార్డ్సు వేపు చూడకుండా, గ్లాసులోని విస్కీని పూర్తిచేస్తున్నాడు.

వినీత ముక్కలు తీసి ధరమ్‌కి అందించింది. అందించి విస్కీ గ్లాస్ తీసుకుని మెరుస్తున్న తన పెదవులకు ఆనించుకున్నది.

ధరమ్ మాత్రం పావనినీ, వినీతనీ మార్చి మార్చి చూస్తున్నాడు.

రాజా అన్నాడు "కమాన్ ధరమ్, స్టార్టు."

ధరమ్ రెండు వంద రూపాయల నోట్లు టేబుల్ మీద పడేశాడు.

రాజా తన దగ్గరవున్న మూడు నోట్లు బెట్ చేశాడు.

ధరమ్ యింకో రెండు నోట్లు పడేశాడు

"కమాన్ షో! నా దగ్గర ఇంతకన్నా లేదు" అన్నాడు రాజా.

పావని ధరమ్‌ని కన్నార్పకుండా చూస్తున్నది. చూస్తూనే అతన్ని, తన భర్త రాజాతో పోల్చుకుంటున్నది. ధరమ్ రాజా మీద పొడుగు, అందగాడు. రాజా తన భుజం చరవటం చూసి ఉలిక్కిపడింది పావని.

"లక్ పావనీ.. వుయ్ గాట్ యిట్ దిస్ టయిమ్" అంటున్నాడు రాజా.

నోట్లు తన ముందుకు లాక్కొని గ్లాసులోని విస్కీని గడగడా తాగేశాడు.

హుషారుగా "కమాన్ పావనీ..ఫిల్ దెమ్ అప్.." అన్నాడు.

పావని కెస్‌లర్ విస్కీని మళ్ళీ గ్లాసుల్లో నింపుతున్నది.

ధరమ్ ఈసారి ముక్కలు పంచాడు.

ఎత్తయిన నున్నటి వక్షస్థలం మీద జారిపోతున్న వూలీ వూలీ సారీకి, స్వాతంత్ర్యం యిచ్చేసి, రాజావేపు కన్నార్పకుండా చూసింది వినీత.

మళ్ళీ ఆట సాగుతున్నది.

విశాలమైన ఆ విశ్రాంతి భవనంలో ఆ రోజు విలాసంగా గడుస్తున్నది. రాజా తన పుట్టినరోజు సందర్భంగా అతనికి ఎంతో మిత్రుడు, వ్యాపారంలో భాగస్వామి అయిన ధరమ్. అతని భార్య వినీతలను విందు కోసం తమ కంపెనీ విశ్రాంతి భవనానికి పిల్చాడు. ఎప్పుడూ ఎంతోమందిని పిలిచి హడావుడి చేసే రాజా ఈసారి మిసెస్ అండ్ మిస్టర్

ధరమ్‌లనే పిలవటం, పావనికి ఆశ్చర్యం కలగచేసినా, ఎందుకో యిలాగయితేనే బాగుంటుందనిపించింది ఆమెకి కూడా.

ప్రక్కనే వున్న అందమైన స్విట్జర్లాండ్ గడియారంలో చెట్టు కొమ్మ మీద ఊగుతున్న చిలక పదిసార్లు అరచి సమయం పది గంటలయిందని సూచించింది.

''టేబుల్స్ టర్న్ అవటం అంటే యిదే'' అన్నాడు రాజా రెట్టించిన ఉత్సాహంతో.

అప్పటికే రాజా ముందు చాలా నోట్లు వున్నాయి. హుషారుగా ముక్కలు కలుపుతున్నాడు.

ఎర్రటి కళ్ళ పావని, గ్లాసు అడుగున వున్న నాలుగు చుక్కల కోసం తాపత్రయం పడుతున్నది.

ధరమ్ జేబులో మిగిలిన ఒక్క నోటుని తీసి బల్ల మీద వుంచాడు.

వినీతాధరమ్ శరీరం మీద బట్టలు ఏ స్థితిలో వున్నదీ కూడా గమనించే స్థితిలో లేక, సోఫాలో వెనక్కి వాలి వుంది.

రాజా పంచిన ముక్కలు తీసి చూసిన ధరమ్‌కి ఆట మీద ఒక్కసారిగా ఆసక్తి పెరిగింది. ఈ ఆటతో పోయిన డబ్బంతా వచ్చే అవకాశం కనపడింది.

తన దగ్గర వున్న ఒక్క నోటునీ బెట్ చేశాడు.

రాజా అయిదు నోట్లు పడేశాడు.

ధరమ్ అన్నాడు,''ప్రస్తుతం నా జేబు ఖాళీ, కానీ ఆట వదలబుద్దివేయటం లేదు, ఎలా''?

రాజా ఎర్రవడిన కళ్ళతో నవ్వాడు. ''ధరమ్ గాత్రం వద్దు, మై ప్రిన్సిపల్ ఈజ్ కాష్ డౌన్. అంతే''

ధరమ్ ''బట్ ఐ డొంట్ హావ్ ఎనీథింగ్ టు బెట్'' అన్నాడు.

''దెన్ లీవ్ ది గేమ్ టు మి!'' అంటూ రాజా ఆ నోట్లను ముందుకు లాక్కోబోయాడు.

''నో వెయిట్'' అరిచాడు ధరమ్.

అతనికి ఆట వదల బుద్ధి అవటం లేదు.

''ఐ డోంట్ వాంట్ టు లూస్ దిస్ గేమ్!'' అన్నాడు.

''దెన్ బెట్ సమ్ మోర్''

ధరమ్ ఆలోచించాడు. అతని ఆరడుగుల శరీరంలో ఆరున్నొక్క పెగ్గుల విస్కీ పనిచేస్తోంది.

''కమాన్'' అన్నాడు రాజా మళ్ళీ.

సోఫాలో నించి పక్కకి ఒరిగి ధరమ్ ఒళ్ళో పడింది వినీత. ఆమె నున్నటి ఎర్రటి బుగ్గలు విస్కీతో తడిసి మెరుస్తున్నాయి. ఆమె ఎత్తయినవక్షస్థలం ఎగిరెగిరి పడుతున్నది.

''ఒ.కే. ఐ బెట్ మై వైఫ్''అన్నాడు ధరమ్ హఠాత్తుగా.

''ధరమ్?'' రాజా ఆశ్చర్యంగా చూశాడు ధరమ్‌ని.

''యస్! ఐ బెట్ మై వైఫ్ ఫర్ టు డే..కమాన్'' అన్నాడు ధరమ్.

సీసా ఎత్తి చివరకు మిగిలింది , 'రాగానే గొంతులో పోసుకుంటూ.'

రాజా వినీత వేపు చూశాడు. అందమైన ముఖం క్రింద తెల్లటి మెడ, మెడ క్రింద ఎత్తుగా...

"ఓ.కె." అంటూ కొన్ని నోట్లు పడేసి 'షో' అన్నాడు.

ధరమ్ ముక్కలు తిప్పాడు మూడు కింగ్స్.

"సారీ ధరమ్" అంటూ మూడు ఆసులు చూపించాడు రాజా.

ధరమ్ ఏమీ మాట్లాడలేదు.

రాజా ఒక్క క్షణం ధరమ్‌నీ, వినీతనీ చూసి సోఫాలోంచి లేచి వెనక్కి తిరిగాడు.

"రాజా! బెట్ ఈజ్ బెట్..టేక్ వినీతా ఫర్ టు నైట్ ఫర్ యువర్ బర్త్ డే ప్లెజర్!" ధరమ్ మత్తుగా అంటున్నాడు.

★ ★ ★

రాజారావ్ చకచకా పని చేసుకుంటున్నాడు. ఆ రోజుకి పూర్తి చేయాల్సిన ఫైల్సు ఇంకా పదహారు వున్నాయి.

ఆఫీస్ గడియారం ఆరు గంటలు కొట్టింది.

ఆఫీస్‌లో అందరూ అయిదు గంటలకే వెళ్ళిపోయిన కారణంగా వాతావరణం నిశ్శబ్దంగా వుంది.

ఆఫీసర్ గదిలో నెమ్మదిగా తిరుగుతున్న ఫాన్ శబ్దం, మూసి వున్న ఆ గదిలో నుంచి బయటకు రావటంలేదు.

ఫాన్ క్రింద కూర్చుని తాపీగా కాగితాలు చూసుకుంటున్న ఆఫీసర్ నరసింహం గడియారం గంటలు కొట్టడం విన్నాడు. కానీ, ఎన్ని గంటలు కొట్టిందో లెక్కపెట్టలేదు. అందుకే తన రిస్టువాచీలో టైమ్ చూసుకున్నాడు. ఒక్కసారి ఒళ్ళు విరుచుకున్నాడు. బల్ల మీద బెల్‌ని టంగ్‌మని మ్రోగించాడు.

ఆ గది ముందర బల్లమీద కునికిపాట్లుపడుతున్న ప్యూన్ ఉలిక్కిపడి లోపలకు వెళ్ళాడు.

"అందరూ వెళ్ళిపోయారా.. ఎవరయినా వున్నారా?" అడిగాడు నరసింహం.

"అందరూ వెళ్ళిపోయారు కానీ.."

"మాలతి వుందా వెళ్ళిపోయిందా..." అడిగాడు నరసింహం.

"టైపిసష్టగారాండీ.. ఎల్లిపోయారండి. రాజారావ్ గారు మాత్తరం పనిచేసుకుంటున్నారండీ!" అన్నాడు ప్యూన్.

నరసింహం ఒక క్షణం ఏదో ఆలోచించాడు.

"ఊ" అని తలపంకించి, కుర్చీలోంచి లేచి బయటకు వచ్చాడు.

రాజారావ్ చాలా సీరియస్‌గా, శ్రద్ధగా పనిచేసుకుంటున్నాడు.

"ఏం రాజారావ్ యింకా పూర్తవలేదా?"

నరసింహాన్నిచూసి తడబడుతూ లేచాడు రాజారావ్ - "అవుతున్నది సార్" అన్నాడు

వినయంగా.

"మన ఆఫీసులో అందరికన్నా నీకు పని ఎక్కువయ్యా, కష్టపడి పనిచేస్తున్నావ్ కూడాను" అన్నాడు నరసింహం.

నరసింహం మొదటిసారిగా యిలా మాట్లాడటం చూసి ఆశ్చర్యపోయిన రాజారావ్.. ఏమనాలో తెలీక తల వూపాడు.

"అయనా పోయినసారి నీకు రావాల్సిన ప్రమోషన్ కొండలరావ్‌కి వచ్చింది. పోనీలే ఈసారి తప్పకుండా నిన్నే రెకమండ్ చేద్దాం!" అన్నాడు నరసింహం తనంతట తానే.

పొంగిపోయిన రాజారావ్ "థాంక్యూ సార్. థాంక్యూ!" అన్నాడు.

"పదపోదాం...మీ యిల్లు విజయనగర్‌కాలనీలోనేకదా" అంటూ ముందుకు నడిచాడు నరసింహం.

రాజారావుకు చాలా ఆశ్చర్యంగా వుంది. నరసింహం తనతో ఎప్పుడూ అంత యిదిగా మాట్లాడలేదు. అందరిలోకీ తనే కష్టపడి పనిచేసినా యింతవరకూ తనని గుర్తించలేదు నరసింహం. ఏ పనీ చేయకుండా కబుర్లు చెప్పే కొండలరావు మాత్రం పైకి వెళ్ళిపోతున్నాడు. ఆరేళ్ళ క్రితం భార్య చనిపోయిన నరసింహానికి, కొండలరావు తన భార్య ద్వారా ఆనందాల్ని సప్లయి చేస్తుంటాడనీ,అందుకే అతనికి రెండు ప్రమో షన్లు యిప్పించాడనీ ఒక వదంతి కూడా వుంది.

'పద పద' అంటూ ముందుకు నడిచాడు నరసింహం.

ఆలోచనలలో నించి తేరుకుని, గబగబా ఫైల్స్ సర్దేసి బయల్దేరాడు రాజారావు.

స్కూటర్ స్టార్టు చేసి, రాజారావుని వెనక ఎక్కమన్నాడు నరసింహం.

ఇందాకే పడాల్సిన ఆశ్చర్యమంతా పడ్డాడు కనుక, ఈసారి ఆశ్చర్యపడకుండానే, వెనక ఎక్కాడు రాజారావ్.

అప్పటిదాకా కష్టపడి పనిచేసిన రాజారావుకి సాయంకాలపు చల్లటి గాలి తగలటంతో హాయిగా వుంది.

"నిన్నటి నుంచీ సులోచన గుర్తుకు వస్తున్నదయ్యా రాజారావ్...రాత్రి అసలు నిద్ర పట్టలేదు!" అన్నాడు నరసింహం.

సులోచన ఎవరో అడగవచ్చో, అడగకూడదో అర్థం కాని రాజారావ్.. ఏమనాలో తెలీక "ఎస్సార్!" అన్నాడు.

నరసింహం నవ్వాడు. "సులోచన ఎవరోనీకు తెలీదు కదూ.. ఆమె నా భార్య,, చనిపోయి ఆరేళ్ళయింది?"

"చొచ్చో" అని సానుభూతిగా చప్పరించాడు రాజారావ్.

"సిన్స్ దెన్ ఐ యామ్ లివింగ్ ఎలోన్" అన్నాడు మళ్ళీ నరసింహం.

రాజారావుకి ప్రతీసారీ ఏమనాలో తెలియటం లేదు. ఇంకోళ్ళయితే సరిగ్గా మాట్లాడేవాడేకానీ, ఆ మాట్లాడేవాడు బాస్ అనీ, అందులోనూ చండప్రచండుడనీ, క్రింద

వుద్యోగస్తుల జీవితాన్ని ఒక్క కలం పోటుతో నాశనం చేస్తుంటాడనీ గుర్తుకువచ్చి, ఏమంటే ఏమొస్తుందో అని ఫ్రీగా మాట్లాడలేకపోతున్నాడు రాజారావు.

సరిగ్గా రాజారావు యింటి ముందు స్కూటరాపేడు నరసింహం.

"మీ యిల్లు నాకు ఎలా తెలుసా అని ఆశ్చర్యపోతున్నావా?" అడిగాడు నవ్వుతూ నరసింహం.

ఆశ్చర్యపడుతున్న రాజారావు, గాబరాపడి "నో సార్...నో..." అంటూనే మళ్ళీ సర్దుకుని, "లోపలికి రండిసార్.. కాఫీ త్రాగి వెడుదురుగాని" అన్నాడు.

"ఓ...ష్యూర్" అంటూ స్కూటరు పార్కు చేసి లోపలకు వచ్చాడు నరసింహం.

"నా భార్య విజయ" అని పరిచయం చేసినపుడు ఆమెనుకన్నార్పకుండా ఒక్క క్షణం చూశాడు నరసింహం.

"దీసీజ్ సమీర.. మా అమ్మాయి..రెండేళ్ళ వయసు"అని కూతుర్ని ఎత్తుకుంటూ అన్నాడు రాజారావు.

"లవ్‌లీ.. సీమర ,చాలా అందంగా వుంది.. అచ్చం మీ ఆవిడ పోలికేనయ్యా.. ముద్దొస్తున్నది" అంటూ సమీరను ఎత్తుకుని, ఆ పిల్ల బుగ్గమీద వరుసగా మూడు ముద్దులు పెట్టుకున్నాడు నరసింహం.

విజయ తల వంచుకుని లోపలకు వెళ్ళింది.

ఉన్న అరగంటసేపూ నరసింహమే మట్లాడాడు. అది కూడా ఎక్కువగా రాజారావు ప్రమోషన్ గురించే. ఈసారి త్వరలోయింకో ఛాన్స్ రాబోతున్నదనీ, అది వదులుకుంటే, యింక నాలుగయిదేళ్ళ దాకా చాలా కష్టం అని చెప్పాడు. అంతా తన చేతుల్లోనే వుందని స్పష్టపరిచాడు నరసింహం.

నరసింహం చెబుతున్నది వింటూనే, ఏవేవో ఆలోచనల చేశాడు రాజారావు.

విజయ అందించిన టిఫిన్, కాఫీలను సేవించాడు నరసింహం.

ఆఫీసరుగారికి మంచి అతిథ్యమే యిచ్చాడు రాజారావు.

అంతా అయిన తర్వాత పోతూ పోతూ.. మళ్ళీ సమీరను ముద్దు పెట్టుకుని.. "స్వీట్ గాళ్" అన్నాడు.

స్కూటరు ఎక్కి వెళ్ళిపోయాడు....

తర్వాత రెండు నెలల్లో ప్రమోషన్ కాగితాలు అందుకున్న రాజారావును ఆఫీసులోఅందరూ అభినందించారు.

'జీవితంలో ఎన్నో జూదాలు ఆడాల్సి వుంటుందయ్యా.. ఒక్కొక్కప్పుడు ఓడిపోవచ్చు. ఒక్కొక్కప్పుడు గెలవవచ్చు. ఓడిపోయినప్పుడల్లా, గెలవటానికి ఎలాగోలా ప్రయత్నం చేయటం, గెలిచేదాకా ఆడటం, అదే నా ఫిలాసఫీ... అప్పుడే జీవితాన్ని సరిగ్గా అనుభవించగలం' అని తనకు తెలిసిన వేదాంతసారాన్ని మళ్ళీ యింకోసారి చెప్పాడు నరసింహం.

★ ★ ★

దేవుడికి ఒళ్లు కాలిపోతూవుంది...

ఆదెమ్మ డాక్టరుబాబుని కలిసింది కానీ, ఆయన మందు మాత్రం యివ్వలేదు. కాగితం మీద ఏవో మందుల పేర్లు వ్రాసి యిచ్చాడు.

"ఈ మందులు కొనుక్కురా... వెంటనే ఈ సూది మందు ఎక్కిస్తే కాని నీ కొడుక్కి జ్వరం తగ్గదు" అన్నాడు.

మెడికల్ షాపులో అడిగితే ఆ ఇంజక్షన్, మిగతా మందుల ఖరీదు పది రూపాయలు అన్నాడు షాపతను.

పరుగెత్తుకుంటూ ఇంటికి వచ్చింది ఆదెమ్మ.

దేవుడు అపస్మారకంగా చాప మీద పడుకుని వున్నాడు. ఒళ్ళు విపరీతంగా కాలిపోతూ వున్నది.

చూరులోనించి డబ్బా తీసి, తను దాచుకున్న డబ్బుల కోసం చూసింది.

డబ్బా ఖాళీగా వుంది.

ఆదెమ్మకు ఏం జరిగిందో అంతా అర్థమయింది.

గుడిసె బయట ముద్దగా పాట వినిపిస్తున్నది.

కోపంతో వణికిపోతూ బయటకు వచ్చింది ఆదెమ్మ.

కుంటికాలును పైకెత్తి ఆడిస్తూ పాటలు పాడుతున్నాడు దరమన్న. అతని నోట్లోంచి క్రిందకు కారిన సారా చారలు గడ్డం మీద మెరుస్తున్నాయి.

"మావా.." పెద్దగా అరిచింది ఆదెమ్మ

ఉలిక్కిపడ్డాడు దరమన్న.

"ఏటే అట్టా అరుస్తావ్..తాగానా ఏంది?"అన్నాడు.

గబగబా అతని దగ్గరకు వెళ్ళింది.

"నే డబ్బాలో పెట్టిన డబ్బులు ఏటిసేసినావ్" అన్నది కోపంగా.

"నేనేటి సేసినాను నీయే యాడబెట్టినవో..." మాటలు తడబడుతుండగా అన్నాడు దరమన్న.

"మన దేవుడు జొరంతో సత్తా వున్నాడు. ఆ డాట్టరు బాబేమో పది రూపాయల మందులు యిస్తే కాని లాభం నేదన్నాడు...యిప్పుడెట్టాగంటావ్?" కోపాన్ని మింగుతూ కొంచెం నెమ్మదిగా, దుఃఖం కమ్ముకురాగా అంది ఆదెమ్మ.

"అడికేం ఫరవాలేదే. ఆడిపేరు దేవుడే, ఆడేం సావడు...దేవుడేడన్నా సత్తాడంటే..." అని నవ్వి, ఇంకో పాట మొదలెట్టాడు దరమన్న.

వాడితో యిక లాభంలేదనుకుందో ఏమిటో చుట్టుపక్కల డబ్బు అప్పుగా నయినా దొరుకుతుందేమోనని వెళ్ళింది ఆదెమ్మ.

ఏ రోజు గంజి ఆ రోజే సంపాదించుకునే ఆ గుడిసె వాళ్ళ దగ్గర డబ్బు ఎలా దొరుకుతుంది? అలసిపోయి గుడిసె చేరింది ఆదెమ్మ.

రిక్షా రంగడితో మాట్లాడుతున్నాడు దరమన్న.

ఆదెమ్మ రావటం చూసి అడిగాడు దరమన్న "దొరికినాదటే" అని.

"ఎట్టా దొరుకుతుందనుకున్నావు" చీదరింపుగా అన్నది ఆదెమ్మ.

"ఎంతకావాలేటి" అడిగాడు రంగడు.

"పది రూపాయలు యిస్తేకాని డాక్టరు బాబు చూడడంట" అన్నది ఆదెమ్మ.

'పెసిడెంటు బాబుగోరబ్బాయి మొన్ననే వచ్చిండు...ఆర్ని అడిగితే ఎంతయినా యిత్తారు' అన్నాడు రంగడు.

"మరి నేనీ కుంటికాలితో రాలేనుగందా - ఆదెమ్మను తీసుకెడతావేంటిరా రంగా... డబ్బులు తెచ్చుకుంటుంది!" అన్నాడు దరమన్న రంగడి కేసి కన్ను గీటుతూ.

"అదేటిబాగ్గెం దరమన్నా.. ఈ మాత్రం సాయం సేయలేనేటి ఆదెమ్మా పద పోదారి' అన్నాడు రంగడు, అర్థమయిందన్నట్టుగా దరమన్నను చూసి తల వూపుతూ.

అమాయకపు ఆదెమ్మ కళ్ళు ఆశగా మెరిశాయి.

"ఆ బాబు ఏడున్నాడు?" అంది.

"ఓటేలు యిశాకాలో..పద పద. ఎడదాం.." అన్నాడు రంగడు.

ఆదెమ్మ ఒకసారి లోపలకు వెళ్ళింది. దేవుడి నుదిటి మీద చేయి పెట్టి చూసింది. సలసలా కాగిపోతున్నది. దేవుడ్ని సరిగా పడుకోబెట్టి, గబగబా వచ్చి రిక్షా ఎక్కింది.

"మామా..దేవుడ్ని సూత్తా వుండు..నేనిప్పుడేవత్తా..." అంది.

"సూత్తాలేయే.. నువు సెప్పాలా ఏంది?" అన్నాడు దరమన్న.

ఇంతలో ఏదో గుర్తుకొచ్చి "ఒరేయ్ రంగా! నీ దగ్గర ఓ రెండ్రూపాయలువుంటే పడేయ్‌రా.. ఆ బాబు యిచ్చేదాంట్లో తెగ్గోసుకుందుగాన్లే" అని అరిచాడు.

"ఎందుకు మల్లీ తాగటానికా?" అన్నది ఆదెమ్మ.

"ఛ...అదేటే తప్పుడుమాటలంటావు..ఈనోగా దేవుడికి ఏదన్నా అవసరమవుతే" ..సణుగుతున్నాడు దరమన్న.

రంగడు ఒక రూపాయి బిళ్ళ దరమన్న ఒళ్ళో పడేసి రిక్షా తొక్కుకుంటూ ముందుకెళ్ళిపోయాడు.

దరమన్న లేచి, కర్ర అందుకుని కుంటుకుంటూ బ్రాకెట్ ఆడే షాపు వేపు నడిచాడు.

★ ★ ★

"నువ్వెప్పుడూ మంచి కథలు వ్రాస్తావని అనుకుంటాను..కానీ ఈసారి ఇదేమిటి ఇంత సెక్స్ కథ రాసావ్..ఛీ ఛీ" అన్నాడు అవధాని కథ పూర్తిగా చదివి కాగితాలు విసిరేస్తూ.

"ఇలాంటి కథలే పురాణాల్లో వుంటే అవి పవిత్ర గ్రంథాలూ, దాంట్లో పాత్రలు పుణ్యపురుషులూ అయిపోతారు.. వీడి లాటివాడు నిజంగా జరుగుతున్న యిలాటి విషయాన్ని తీసుకుని కథ రాస్తే నీలాటి వాళ్ళకది అశ్లీలము, అసభ్యమునూ..నీలాంటివాళ్ళ ద్విపాత్రాభినయనానికి జోహార్లురా అవధాన్లూ..."

నేను జవాబు చెప్పేలోగానే అన్నాడు అంతకు ముందే ఈ కథ చదివిన చిదంబరం.